


# కథ అమ్మా! నాన్న! ఓ ప్రేమకథ!

కారంపూడి వెంకట రామదాస్

"నేనో అమ్మాయిని ప్రేమించాను. ఆమెనే పెళ్ళి చేసుకుంటాను" కుటుంబ సభ్యుల సమావేశంలో బాంబు పేల్చాడు ప్రతాప్.

ఇలాంటిదేదో కొడుకు నుండి ఎప్పుడో ఒకప్పుడు వినవస్తుందని ముందుగానే ఊహించిన మహేశ్వర్రావు పెద్దగా ఆశ్చర్యపోలేదు.

కుండబద్దలు కొట్టినట్టు కొడుకు తన నిర్ణయాన్ని తెలియజేయడానికి కారణం చిన్నప్పట్నుండి తానిచ్చిన చనువేనని మహేశ్వర్రావుకి తెలుసు. తండ్రిగా తానెప్పుడూ అధికారం చెలాయించలేదు. స్నేహితుడిగా మాత్రమే సాంగత్యం చేసాడు.

"ఏరా! నీకిదేం బుద్ధి! తోడబుట్టిన దొకర్తె వుందని మరచిపోయి ఏంటా మాటలు" కోపంతో అంది ప్రతాప్ తల్లి జానకి.

"జానకీ! నువ్వుండు!" భార్యని వారించాడు మహేశ్వర్రావు.

"ప్రతాప్! నీకెంత స్వాతంత్రమిచ్చి పెంచినా, సాంప్రదాయ విరుద్ధంగా నిన్నెప్పుడూ పెంచలేదు. పద్ధతి ప్రకారం ముందు నీ చెల్లెలి పెళ్ళి కావాలి! ఆ సంగతి మరచిపోయావా?" కొడుకుతో అన్నాడు మహేశ్వర్రావు.

"నాన్నా! ఎప్పుడో పంధొమ్మిదో శతాబ్దంనాటి నియమాలు ఈ కంప్యూటర్ యుగంలో కూడా పాటించాలా?"

"ఒరే! నేనూ ఎవడ్నో ఒకర్ని ప్రేమించానని చావుకబురు చల్లగా చెబితేనో" రోషంతో అంది ప్రతాప్ చెల్లి.

"పళ్ళు రాల్తాయి..." టక్కున అని నాలిక కరచుకున్నాడు ప్రతాప్.

"సాంప్రదాయాలు పాటించడానికి అడ్డొచ్చిన కంప్యూటర్ యుగం, నీ చెల్లిలి ప్రేమనంగీకరించడానికి అభ్యంతరం దేనికో..." దెబ్బ కొట్టింది ప్రతాప్ చెల్లెలు.

చెల్లెలు తన దారి తప్పని చెప్పడానికి తనతో వాదులాటకి దిగింది తప్పా, ఆమె ఎవరినీ ప్రేమించలేదని తెలిసి కూడా తానెందుకిలా మాట్లాడుతున్నాడు? తన ఆలోచనల్లో ఈ ద్వంద్వవైఖరేమిటి? అని ఒక్కక్షణం ఆలోచించాడు ప్రతాప్. అయితే యిది అప్రస్తుతమని, తన ప్రేమే తనకిప్పుడు ముఖ్యమనుకుని వెంటనే సర్దుకున్నాడు.

"ఏదో తెలివిగా మాట్లాడుతున్నానని అనుకోకు..." అన్నాడు చెల్లెలితో ప్రతాప్.

"ఆపండిరా! మీ ప్రేలాపన!" కలగజేసుకున్నాడు మహేశ్వర్రావు.

"చూడు ప్రతాప్! ప్రేమించడం తప్పనను. అలాగే నువ్వు ప్రేమించిన అమ్మాయిది ఏ కులమో, గోత్రమో కూడా నాకనవసరం. కాకపోతే, నీది నిజమైన ప్రేమో కాదో తెలుసుకుని ముందడుగు వెయ్యి!" అన్నాడు మహేశ్వర్రావు.

"ప్రేమ గురించి మీకూ, మీ తరం వాళ్ళకేం తెలుసు? యిప్పుడు కాలం మారింది. ఎక్కడ చూసినా ప్రేమ వివాహాలే! మా ప్రేమపై మీకు అనుమానం అనవసరం!"

ప్రేమ గురించి మీకేం తెలుసు? అన్న కొడుకు ప్రశ్నకి మహేశ్వర్రావు-జానకిలు ఒకరినొకరు చూసుకున్నారు. తమ ప్రేమనే ప్రశ్నించేటంతటి వాడైన కొడుకువైపు జాలిగా చూసారిద్దరు.

"ప్రతాప్! నీ ప్రేమని కాదనేటంతటి కుసంస్కారులం కాదు మేము. తొందరపాటుతో ఏ నిర్ణయం తీసుకోకు. ఓ రెండు, మూడు నెలలాగిన తరువాత కూడా నువ్వామెనే నిజంగా కోరుకుంటే నీ నిర్ణయం సరైనదేనని ఒప్పుకుంటాను" చెప్పాడు మహేశ్వర్రావు.

భర్త ఆలోచన ఎప్పుడూ తప్పుకాదని తెలిసిన జానకిమౌనంవహించింది.

***

"లతా! చెప్పేసాను, మా యింట్లో మన ప్రేమ గురించి చెప్పేసాను" యిక ఏ భయం లేనట్టు అన్నాడు ప్రతాప్.

"ఒప్పుకున్నారా?" లత వేసిన ఆ ప్రశ్నలో ఎటువంటి ఆత్రుతా ధ్వనించలేదు.

"ఆఁ... ఒప్పుకోకేం? నా మాట వాళ్ళెప్పుడూ కాదనలేరు!"

"సరే, మరి నీ మాటేమిటి? మీ వాళ్ళతో ఎప్పుడు చెప్తావు మన ప్రేమ సంగతి" తిరిగి తనే అడిగాడు ప్రతాప్.

"ప్రతూ... సరే చూద్దాం... ముందుగా మనం కొన్నాళ్ళు ప్రేమని ఎంజాయ్ చెయ్యాలి. ఆ తరువాతే ఏదైనా!" ప్రతాప్ చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నిమురుతూ అంది లత.

"యస్....! యు ఆర్ రైట్! లెటజ్ ఎంజాయ్ లవ్!"

"ప్రతూ! రేపు ఈవినింగ్ మనం హోటల్ ఉడ్‌బ్రిడ్జ్‌లో కేండిల్ లైట్ డిన్నర్ ఎంజాయ్ చెయ్యబోతున్నాం" ఉత్సాహంగా అంది లత.

ఈ మాటలకి ప్రతాప్ హృదయం పరవశించింది. యస్! లతకి తనమీద ఎంత ప్రేమ! తన బర్త్‌డే అని ముందుగానే గుర్తు పెట్టుకుని హోటల్‌లో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయబోతున్నదన్నమాట! ఏమీ తెలీనట్టు ఆమె నుండి అసలు విషయం రాబట్టాలనుకున్నాడు.

"ఎనీథింగ్ స్పెషల్, టుమారో? సడన్‌గా ఈ ప్రోగ్రామ్ దేనికో?"

"రేపు నువ్వే చూద్దువుగానీ..." అంటూ మాట దాటేసింది.

***

ఆరోజు ఫిబ్రవరి ఇరవైతొమ్మిదో తారీఖు.

మహేశ్వర్రావు కుటుంబానికి అతిముఖ్యమైనరోజు. ఎందుకంటే- తండ్రీ, కొడుకుల పుట్టినరోజు ఒకే రోజు కావడం! నాలుగు సంవత్సరాల కొచ్చే అరుదైన పుట్టినరోజు.

"ప్రతాప్! హేపీ బర్త్‌డే టూ యూ!" మొదటిగా శుభాకాంక్షలు తండ్రి నుండి అందుకున్నాడు ప్రతాప్.

"థాంక్యూ డాడీ! సేమ్ టు యూ!" అన్నాడు ప్రతాప్.

ప్రతాప్ పుట్టినరోజు ప్రతి సంవత్సరం తిథుల ప్రకారం జరుపుకున్నా, మహేశ్వర్రావు మాత్రం నాలుగేళ్ళకొకసారి మాత్రమే జరుపుకునేది. అదీ జానకి బలవంతం మీద.



## ఫోటో

"రాజూ! నాకు పెళ్ళయిపోయింది. నేను రాసిన ఉత్తరాలు, నా ఫోటోలు నీ దగ్గర వున్నవి వెంటనే పంపించు. మావారికి తెలిస్తే బాగుండదు" అని ఉత్తరం రాసింది రాధ.

దానికి సమాధానంగా రాజు దగ్గర నుంచి పెద్ద కవరు వచ్చింది. దాంట్లో ఫోటోలతో పాటు ఓ కాగితం మీద ఇలా రాశాడు రాజు-

"నీ ముఖం ఎలా ఉంటుందో కూడా నాకు గుర్తులేదు. నేను పంపించే కవరులో చాలా ఫోటోలు వున్నాయి. వాటిలో నీ ఫోటోలు ఏమయినా ఉంటే తీసుకుని మిగిలినవి తిరిగి పంపించు. దీంట్లో రిటన్ కవర్ కూడా పెడుతున్నాను".



ఆరోజు సందడంతా జానకమ్మదే. భర్తా, కొడుకుల పుట్టినరోజు కావడంతో పిండివంటలతో ఉదయం నుండి కుస్తీ పడుతున్నది.

అది చూసి ప్రతాప్ 'పాత పద్ధతులూ వారూ... లైఫ్‌లో వెరైటీగా సెలబ్రేషన్స్ చేసుకోవాలన్న ఆలోచనే వారికి లేదు. పూర్ ఫాదర్! ఎప్పుడూ ఓ వెరైటీ ఎరగడు' అని మనసులో అనుకున్నాడు.

"నాన్నా! ఈ సంవత్సరం నేను నా బర్త్‌డే సెలబ్రేషన్స్ బయటే జరుపుకుంటున్నాను. ఇంట్లో ఎటువంటి హంగామా వద్దు!" అన్నాడు ప్రతాప్, సాయంత్రం తాను లతతో హోటల్‌లో గడపబోయే క్షణాలని ఊహించుకుంటూ.

ప్రతాప్ నిర్ణయానికి యింట్లో వారు నిరుత్సాహపడ్డా ప్రతాప్ పెద్దగా పట్టించుకోలేదు.

లత నుండి ఎప్పుడు ఫోన్ వస్తుందా, ఎప్పుడు ఆమె నుండి బర్త్‌డే విషెస్ అందుకుందామా అని ఎదురు చూస్తున్నాడు ప్రతాప్. ఊహించినట్టుగానే లత నుండి ఫోన్ వచ్చింది.

"హాయ్ లతా! హౌ ఆర్ యూ?" పలకరించాడు ప్రతాప్.

"ఫైన్! ఈవినింగ్ హోటల్ ప్రోగ్రామ్ గురించి గుర్తు చేద్దామని!" ఫోన్ చేసిన కారణం చెప్పింది లత.

లత నుండి విషెస్ ఎక్స్‌పెక్ట్ చేసిన ప్రతాప్ డిసపాయింట్ అయ్యాడు. మరచిపోయిందేమో! గుర్తుచేస్తేనో? 'నో'! ఆమే స్వయంగా చెపితే బాగుంటుందని ఊరుకున్నాడు ప్రతాప్. ఒకవేళ తనని ఏడిపించాలని కావాలనే విషెస్ చెప్పకుండా సర్‌ప్రైజ్‌గా ఈవినింగ్ గ్రాండ్ లెవల్లో పార్టీ ఎరేంజ్ చేసి థ్రిల్‌గా విషెస్ చెబ్దామనుకుంటున్నదా? ఏమైనా తాను మాత్రం గుర్తు చేయకూడదనుకున్నాడు.

"నో! నాకు గుర్తుంది! ఉయ్ విల్ మీట్ ఇన్ ద యీవినింగ్!" అన్నాడు ప్రతాప్.

***

ప్రతాప్ హోటల్ చేరేసరికి లత ఆల్‌రెడీ ఓ మూల తమకోసం రిజర్వ్ చేసిన టేబుల్ దగ్గర కూర్చునుంది. హాలంతా డిమ్‌లైట్లతో ముఖాల రూపులు మాత్రమే కనిపించేటట్టున్నాయి.

"హాయ్!" లతని విష్ చేసాడు ప్రతాప్.

"హాయ్!" తిరిగి విష్ చేసింది లత.

"లతా! ఈ పార్టీకి కారణమేమిటో?" కదిపించాడు ప్రతాప్.

"పార్టీ ఏంటి ప్రతాప్! జస్ట్ టైమ్‌పాస్‌కి సరదాగా ఈ ప్రోగ్రామ్ వేసాను, దట్సాల్!" సీరియస్‌గా అంది లత.

ఈ మాటలకి ప్రతాప్ అవాక్కయ్యాడు. ఈరోజు నీ బర్త్‌డే అందుకే ఈ పార్టీ అంటూ తనని విష్ చేస్తుందని ఆశించిన ప్రతాప్ చాలా డిసపాయింట్ అయ్యాడు. అసలామెకి ఈ విషయం గుర్తుందా?

ఎందుకుండదూ...? ఒకరి బర్త్‌డే ఒకరికి తెలుసు. మరచిపోవడానికిది చిన్న విషయమా? అసలే అరుదైన పుట్టినరోజు తనది.

లత బర్త్‌డేకి తానెంత హంగామా చేసాడు. అర్ధరాత్రి పన్నెండు దాటీ దాటగానే సెల్‌ఫోన్‌లో విషెస్ చెప్పి థ్రిల్ చేసాడు. తెల్లవారుతూనే ఆమె హృదయపు తలుపులు తడుతూ రంగురంగుల పూలబొకేతో ప్రారంభించిన సెలబ్రేషన్స్, ముత్యాల నెక్లెస్ ప్రజెంటేషన్‌తో పాటు మూవీ, ఆ తరువాత మంచి స్టార్ హోటల్లో లంచ్ అన్నీ ఆమెకి నచ్చేవిధంగా జరిపి తన ప్రేమని చాటుకున్నాడు. మరి లతో? అదే ఆలోచిస్తున్నాడు ప్రతాప్.

డిన్నర్ పూర్తవగానే బిల్లుకట్టి బయటపడ్డాడు ప్రతాప్.

"ప్రతూ! యిట్స్ ఆల్‌రెడీ లేట్!" చివరికంది లత.

ఒక్కసారిగా ప్రతాప్‌లో జీవం వచ్చింది. యిప్పటికే చాలా ఏడిపించాను, యిక చాలు అంటూ ఆమె తనకి గ్రీటింగ్స్ చెప్పబోతోందా? ఆశగా ఆమె నోట ఆ మాట కోసం ఎదురుచూసాడు ప్రతాప్.

అలాంటిదేమీ లత నుండి వెలుబడలేదు.

యిక ఆగలేకపోయాడు ప్రతాప్. "లతా! ఈరోజు నీకు ఏమీ స్పెషల్‌గా అనిపించడం లేదా? కావాలనే అన్నాడు.

"ఈరోజా! ఎందుకు స్పెషల్? ఈరోజు ఏమి పండగ కాదే, పోనీ జనవరి ఇరవైఆరో, లేక ఆగస్టు పదిహేనో కాదే! మరి దేనికి స్పెషల్?"

"ఈరోజు ఫిబ్రవరి ఇరవైతొమ్మిది. అంటే నాలుగేళ్ళకి ఒకసారొచ్చేరోజు! అదే నా పుట్టినరోజు" చివరికి అసలు విషయం చెప్పాడు ప్రతాప్. ఆమెలో రియేక్షన్ కోసం కళ్ళు పెద్దవి చేసుకుని చూసాడు.

'వావ్'? హేపీ బర్త్‌డే టూ యూ!" అంటూ అప్పుడు విష్ చేసింది లత.

విషెస్ మాట పక్కనపెడితే ఆమె నోట కనీసం ఈ సంగతి మరిచిపోయినందుకు 'సారీ' అన్న చిన్న పదం రాకపోయేసరికి విస్తుపోయాడు ప్రతాప్.

షాక్ తిన్నాడు ప్రతాప్. అలాంటి యిలాంటి షాక్ కాదు. ఆమె తన పుట్టినరోజు మరచిపోయిందన్న షాక్ కన్నా, ఆమెకి విషయం గుర్తు చేసినా ఆమె చేసింది తప్పని గుర్తించలేదు. ఈ విషయాన్ని చాలా సామాన్యంగా తీసుకుంది. అదే భరించలేకపోతున్నాడు ప్రతాప్. లత ప్రేమలో నిజాయితీ కోసం అన్వేషణ మొదలైంది ప్రతాప్ మనసులో.

భారమైన గుండెతో యిల్లు ఎలా చేరాడో ప్రతాప్‌కే తెలీదు. మూడ్ మొత్తం స్పాయిల్ అయి క్రుంగిన మనసుతో తన రూమ్‌కేసి నడిచాడు.

అప్పుడు! నాన్నగారి రూమ్ నుండి మెల్లగా ఏవో మాటలు వినిపిస్తున్నాయి. అది అమ్మ గొంతు! ఈ సమయంలో ఏమిటా? అని కొంచెం తెరచివున్న కిటికీలోంచి చూసాడు ప్రతాప్. ఆ దృశ్యం చూసి దిగ్భ్రాంతి చెందాడు.

మహేశ్వర్రావు కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా ఓ టేబుల్. ఆ టేబుల్‌పైన జానకి కష్టపడి అల్లిన క్రోషియో కుట్ల టేబుల్ క్లాత్ అందంగా పరచివుంది. దానిమీద ఉదయం జానకి స్వయంగా ఓవెన్‌లో చేసిన కేక్! పెద్దదీ కాదూ, మరీ చిన్నదీ కాదు. బజారుకేకు కాదు కాబట్టి రంగుల హంగులు లేవు. అయితేనేం! సహజమైన వన్నెతో అందంగా వుంది. రెండు 'ఐదు' అంకెల కొవ్వొత్తులు పక్కపక్కన మహేశ్వర్రావు యాభై ఐదవ పుట్టినరోజుని సూచిస్తూ ఆ పువ్వుల పరిమళం ఆ గదిని కమ్మగా ఆక్రమించుకున్నది.

జానకి రంగుల కొవ్వొత్తులని వెలిగించింది.

"జానకీ! ఏమిటిదంతా? నువివ్వన్నీ చెయ్యకపోతే నా మీద నీకు ప్రేమ లేదన్నట్టా?" మనసులో ఏదో మధురమైన అనుభూతిని అనుభవిస్తూనే బయటకన్నాడు మహేశ్వర్రావు.

"లేదండి! మనసులో ప్రేమ వుంటే మాత్రం సరిపోదు. సరైన సందర్భంలో మన ప్రేమని ప్రదర్శించుకోకపోతే మరి దేనికా ప్రేమ? చిన్న చిన్న చర్యలతో ఎదుటివారిని సంతోషపెట్టి వారి మనసుని దోచుకునే పనులు చాలా చెయ్యొచ్చు. ఇదీ అంతే!"

మహేశ్వర్రావు కొవ్వొత్తుల్ని నెమ్మదిగా వూదుతూ ఆర్పాడు.

"హేపీ బర్త్‌డే టూ యూ!" సిగ్గుపడుతూనే చెవిలో నెమ్మదిగా పాడింది. ఈ పాట మహేశ్వర్రావుకి కోటి సన్నాయిల రాగంలా వినిపించింది.

"థ్యాంక్స్!" కృతజ్ఞత నిండిన మాటలు అప్రయత్నంగా వెలువడ్డాయి మహేశ్వర్రావు నోట.

"ఛా! మన మధ్య థ్యాంక్స్ ఏమిటండీ?" చప్పున అంది జానకి.

జానకి లేచి భర్త పాదాలకి దండం పెట్టింది. అతడామెని లేవనెత్తి హృదయానికి హత్తుకుని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు.

తీయని అనుభూతికి లోనవుతూ తీపికేకు కట్ చేసి మొదటిగా భార్య నోటికందించాడు మహేశ్వర్రావు. ఆమె దాన్నందుకుని భర్తకి తినిపించి మిగతాభాగం తాను తింది. వారి ప్రేమానురాగాల తియ్యదనం ముందు ఆ కేకు తియ్యదనం ఓడిపోయింది.

తల్లిదండ్రుల ప్రేమానుబంధం నిజమైన ప్రేమకి నిలువుటద్దంలా ఎదురుపడిన ఈ దృశ్యం ప్రతాప్‌కి ఓ కమ్మని కలలా అనిపించింది. కదిలితే ఈ కమ్మని కల ఎక్కడ కరిగిపోతుందోనని రాయిలా స్థిరంగా నిలుచుని చూస్తున్నాడు.

జానకి చేతిలో ఓ కవరు! ఆ కవరు తీసి అందులోంచి పట్టుచొక్కా బయటికి తీసింది. స్వచ్ఛమైన ఆమె మనసులా తెల్లగా మెరుస్తూ వుందా చొక్కా. ఎడంవైపు గుండెపైన ఎర్రని గులాబీ అందంగా ఎంబ్రాయిడరీ చేసి వుంది.

"ఏమండీ! ఇది మీ పుట్టినరోజున నా తరఫున చిరుకానుక. మీకు గుర్తుండే వుంటుంది. ఈ మధ్య నేను రాసిన కవితకి ఓ వారపత్రిక బహుమతిగా యిచ్చిన పారితోషికం సొమ్ముతో కొన్న చొక్కా యిది. స్వయంగా నేను సంపాదించినది. అఫ్‌కోర్స్ నా కవితలకి ప్రేరణ మీరే అనుకోండీ!" అంటూ చొక్కాని స్వయంగా తొడిగింది భర్తకి.

"జానకీ! నీకెప్పటినుండో ముత్యాల ముక్కెర చేయించుకోవాలని వుందిగా. నీకొచ్చిన ఈ సొమ్ముతో చేయించుకోలేకపోయావా? ఇప్పుడీ పట్టు చొక్కా నాకు దేనికి?" అభిమానంగా అన్నాడు మహేశ్వర్రావు.

"నా కోరికదేముంది లెండి? మీకు కొనిపెట్టడంలోనే నాకు ఎంతో తృప్తి వుంది" కోరికని జయించిన త్యాగం జానకిది.

సిల్కు చొక్కాలో మహేశ్వర్రావు నిజంగా అందంగా వున్నాడు. భర్తని ఆ చొక్కాలో చూసుకుని మురిసిపోయింది జానకి. మహేశ్వర్రావు నోట మాట రావడం లేదు. క్రమేపి జానకి గొంతు కూడా మూగబోయింది. ఒకరి ఒడిలో ఒకరు. వారి మధ్య ప్రేమ తప్ప మరో భాష లేదిప్పుడు.

ప్రతాప్ కళ్ళు తెలీకుండానే వర్షిస్తున్నాయి. 'ప్రేమ గురించి మీకేం తెలుసు?' అని తాను తల్లిదండ్రులపై సంధించిన అవివేకపు ప్రశ్న చెవిలో పదేపదే మారుమ్రోగింది. పశ్చాత్తాపంతో హృదయం ద్రవించుకుపోయింది.

పెళ్ళికి ముందు ప్రేమ నిజమో కాదోగానీ, పెళ్ళి తరువాత జనించే ప్రేమ మాత్రం స్వచ్ఛమైనదే, అందులో అనుమానం లేదనుకున్నాడు ప్రతాప్. అదే తాను కోరుకోవలసింది.



## అయిదు సంవత్సరాలు

"మీతో కొంచెం మాట్లాడాలి.
రేపు సాయంత్రం అయిదు గంటలకి పార్కుకి రాగలరా?" అని అభ్యర్థిస్తున్నట్టు అడిగాడు ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న రాకేష్ రేష్మతో.

"అలాగే"

మర్నాడు- "ఎందుకు రమ్మన్నారు" అంది సీరియస్‌గా రేష్మ.

"నేను చెప్పేది విని మీరు ఏమీ అనుకోకండి. మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు రాకేష్.

"అలాగే. ముందు చెప్పండి" అసహనంగా అంది.

"నేను నాలుగు సంవత్సరాల నుంచి మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. ఇంక మన చదువు కూడా పూర్తి అవుతోంది. ఇప్పటికి కూడా చెప్పకపోతే నా ప్రేమకు అర్థం వుండదని" అన్నాడు రాకేష్.

వెంటనే రేష్మ చేయి రాకేష్ చెంపను తాకింది. "ఇప్పటికి నీకు ధైర్యం వచ్చిందా చెప్పడానికి. నేను అయిదు సంవత్సరాల నుంచి నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు చెబుతావేమో అని ఎదురుచూశాను ఇన్ని సంవత్సరాలు" అంది రేష్మ కోపంగా.

"ఆఁ...." అంటూ అవాక్కయ్యాడు రాకేష్.